రూ.41.5లక్షల 'సిఎం రిలీఫ్ ఫండ్' మంజూరు

ప్రజాశక్తి-అమలాపురం

రాజోలుకు చెందిన పలివెల బ్లెస్సీకి ప్రోటన్ థెరిపి వైద్య నిమిత్తం రూ.41.5 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేశారు. అమలాపురంలో ఇటీవల సిఎం జగన్ పర్యటనలో మంత్రి పినిపే విశ్వరూప్ ద్వారా పాప బ్లెస్సీ తల్లిదండ్రులు ముఖ్యమంత్రికి పాప ఆరోగ్య సమస్యలు వివరించారు. పాప వైద్యానికి సంబంధించిన ఖర్చులకు రూ.41.50 లక్షలను పినిపే బేబీ మీనాక్షి, డాక్టర్ పినిపే శ్రీకాంత్ చేతుల మీదుగా మంత్రి విశ్వరూప్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పెయ్యల సాయి. భూపతి మహేంద్ర, ఉచ్చుల మోహన్, బొంతు సుధాకర్ పాల్గొన్నారు.

పాపబ్లెస్సీ తల్లిదండ్రులకు అందజేస్తున్న సాయం

ఉన్నత విద్యలో విప్లవాత్మక సంస్కరణలు

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- లబ్ధిదారుల ఖాతాలకు జగనన్న విద్యాదీవెన నిధుల జమ

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యారంగంలో పలు విప్లవాత్మకమైన సంస్కరణలను తీసుకు వచ్చిందనిజిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సోమవారం సిఎం జగన్ చిత్తూరు జిల్లా నగరి నుంచి జగనన్న విద్యాదీవెనకు సంబంధించి ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి నిధులను విద్యార్థిని, విద్యార్థుల తల్లుల ఖాతాకు నేరుగా జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ విధానంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరో తరగతి నుంచి డిజిటల్ తరగతులను ప్రారంభించడం జరిగిందని ఎనిమిదో తరగతిలో బైజ్యూస్ కంటెంట్ ట్యాబ్లను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇంగ్లీష్ మీడియం విద్యా బోధనకై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపు తోందని ఆయన తెలిపారు. సిబిఎస్ఇ సిలబస్ అమలు చేస్తూ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ జారీకి చర్యలు చేపట్టిందన్నారు. మూడో తరగతి నుండి సబ్జెక్ట్ టీచర్ విధానాన్ని అమల్లోకి తేవడంతో పాటుగా విదేశీ విద్య దీవెన ను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందన్నారు. కరికులంలో కూడా మార్పులు తెచ్చి విద్యాబోధన నాణ్యతతో ఉండేలా చర్యలు తీసుకుందన్నారు. ఏ త్రైమాసికం ఫీజు రీయింబర్స్మెంట్ను ఆ త్రైమాసికం అయిన వెంటనే జమ చేయడం జరుగుతుందన్నారు. ఏప్రిల్-జూన్ 2023 వరకు నేడు నిధులను ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఐటిఐ, పాలిటెక్నిక్ డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులు మొత్తం మూడు నెలలకు ఒకసారి చెల్లించడం జరుగుతుందన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి, ఈ బిసి కాపు మైనారిటీ వికలాంగుల కేటగిరీలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈ పథకం చేయూత నందిస్తోందన్నారు.

విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉన్నత చదువులకు ఆర్థిక స్తోమత లేని పిల్లలు ఎంతవరకు చదువు కుంటే అంతవరకు అయ్యే మొత్తం ఫీజులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. దీనితోపాటు వసతి మెస్ ఖర్చుల నిమిత్తం ఏటా రూ.20 వేలు వసతి దీవెన కింద అందిస్తోందన్నారు. పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదివించాలన్న ఆశయంతో ఈ పథకం ప్రవేశపెట్టబడిందన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విద్యా దీవెనకి సంబంధించి ఏప్రిల్-జూన్ 2023 త్రైమాసికములో మొత్తం విద్యార్థినీ, విద్యార్థులకు 31,944 మందికి రూ.24, కోట్ల 3లక్షల 71,562 జమ చేసిందన్నారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయల్ , హితకారిణి సమాజం అధ్యక్షురాలు కాశీ బాల ముని కుమారి, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, జెడ్పిటిసి సభ్యులు శ్రీహరి, మట్టా శైలజ, సాంఘిక సంక్షేమ శాఖ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మి దేవి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

విద్యార్థుల ఉన్నత చదువుల పట్ల పోటీతత్వాన్ని ప్రోత్సహించే దిశగా పలు ట్రస్టులు ముందుకు వచ్చి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన అభయాంజ నేయ స్వామి ఆలయ ట్రస్ట్ సభ్యులు బంగారం జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదుగా పలివెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్చి 23 సంవత్సరంలో 10వ తరగతిలో అధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రశంసాపత్రంతో బహూకరించారు. ప్రథమ బహుమతిగా జి.వెంకట మోహన్‌కు రూ.3వేలు, ద్వితీయ బహుమతిగా సిహెచ్.సాయి దీప్తికి రూ.2వేలు, తతీయ బహుమతిగా ఎం.సునీతకు రూ.1500 జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నగదు, ప్రశంసాపత్రంతో బహూకరించారు.

ముమ్మిడివరంలో దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్ల నిరసన

30, 31 తేదీల్లో దస్తావేజుల లేఖర్ల సహాయ నిరాకరణ

వచ్చే నెల నుంచి ప్రారంభమయ్యే కార్డు 2.0 ప్రైమ్ రిజిస్ట్రేషన్లపై నిరసన

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్డు 2.0 ప్రైమ్ రిజిస్ట్రేషన్లను సెప్టెంబర్ నెల నుంచి ప్రారంభించడాన్ని నిరసిస్తూ ముమ్మిడివరం దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు నిరసన తెలిపారు. ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట సోమవారం సాయంత్రం తమ నిరసనను తెలిపారు. కార్డు 2.0 ప్రైమ్ రిజిస్ట్రేషన్లతో లేఖర్లు, సహాయలకు ఉపాధి గండి కొట్టడానికే ప్రభుత్వం ఈ ప్రక్రియను తీసుకు వచ్చిందని, ఈ కారణంగా తాము ఉపాధి కోల్పోతామని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో పెన్‌డౌన్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యల్లాప్రగడ జగన్నాధరావు, మంత్రిప్రగడ వెంకట కష్ణారావు, చవటపల్లి వెంకటేశ్వరరావు, అయినాపురపు గోపాలకృష్ణ, తాడాల వీరబాబు, సలాది చిట్టిబాబు, నముడూరి సుబ్రహ్మణ్యం, నార్ని బుజ్జి, మద్దిరాల నాగబాబు, తాడి వాసు, అర్ధాని సూరిబాబు, అయినాపురపు వంశీ, యేడిద సోమరాజు, వస్త్రాల శివ, గాలిదేవర సురేష్, బొంతు నరేష్, పెయ్యల వీరా, చవటపల్లి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులపై న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-రామచంద్రపురం

విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులు తగరం కష్ట బాబు పై వీరవల్లి పోలీసులు అక్రమ కేసులుబనాయించడం, ఆవులు పవన్ కుమార్ పై అక్రమ దాడులకు నిరసనగా రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, న్యాయవాదులపై దాడులను అందరు ఖండించాలని నినాదాలు చేశారు. దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలనీ, అక్రమ కేసులు బనాయించిన వీరవల్లి పోలీసులు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి చిన్నం వీర్రెడ్డి, జూనియర్ న్యాయవాదులు పిల్లా రామయ్య, కె.భరత్ కుమార్, కోటిపల్లి లోవ రాజు, కెవివి.సత్యనారాయణ, నేలపాటివీరభద్రరావు, ఇంత సుకుమార్, వినకోటి గంగాధర్, సూరంపూడి గంగాధర్, జగదీష్, బండి శ్రీను, చోడి జాన్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

విద్యుత్ పోరాట అమరవీరులకు సిపిఎం నివాళి

ప్రజాశక్తి-అమలాపురం

ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు, ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన రామకృష్ణ,విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి ల 23వ వర్ధంతి సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ ఘనమైన నివాళి అర్పిస్తోందనీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన నేటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోగా 100 శాతం విద్యుత్ ఛార్జీలు పెంచిన నేపథ్యంలో విద్యుత్ అమరవీరులను స్మరించుకోవాలన్నారు. ఆగస్టు 30 నుంచి విద్యుత్ ఛార్జీలను, నిరుద్యోగం, అధిక ధరలను వ్యతిరేకిస్తూ సిపిఎం పార్టీ నిర్వహించే పోరాటంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కారెం వెంకటేశ్వరరావుకోరారు.

సమీక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంఇఒ

బడి బయట పిల్లలపై సర్వే

ప్రజాశక్తి - మామిడికుదురు

అన్ని గ్రామ సచివాలయ పరిధిలో ఐదు నుంచి 18 ఏళ్ల వయసు గల బడి బయట పిల్లలను గ్రామ వాలంటీర్ల ద్వారా సర్వే చేయించాలని పరిపాలనాధికారి కారుపల్లి వెంకటేశ్వరరావు సూచించారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచా యతీ కార్యదర్శులు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఎంఇఒ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సెప్టెంబర్ నాలుగులో బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించుటకు యాప్ లో నమో దు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధి కారి-2 వెంకన్న బాబు, ఇఒపిఆర్డి బి.మమత తదితరులు పాల్గొన్నారు.

కేశవరంలో 'మహాశక్తి'

ప్రజాశక్తి-మండపేట

కేశవరం గ్రామంలో మహాశక్తి కార్యక్రమం గ్రామ టిడిపి అధ్యక్షులు అబ్బిరెడ్డి సత్యం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పెదపాటి సత్తిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి తదితరులు ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

'జెపి' ముసుగులో అక్రమ ఇసుక దందా

ప్రజాసమస్యల పోరాటంలో పాల్గొన్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

జెపి సంస్థ ముసుగులో సిఎం జగన్ అక్రమ ఇసుక దందా నిర్వహిస్తూ రూ.కోట్ల ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని స్థానిక ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, శాసన మండల మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం విమర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పోరాటంలో భాగంగా సోమవారం మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలో అక్రమంగా నిల్వచేసిన ఇసుక గుట్ట వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం హయాంలో ప్రజలకు ఉచితంగా ఇసుక అందిస్తే, ఈ ప్రభుత్వ హయాంలో ఇసుక ధర ఇష్టానుసారంగా ఎంచి సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా కొందరు జేబుల్లోకి వెళ్ళే కార్యక్రమాన్ని సిఎం జగన్ తీసుకొచ్చారని విమర్శించారు. ప్రభుత్వానికి రావలసిన ఇసుక మైనింగ్ సొమ్ము ఎక్కడికి పోతుందో.. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ఇసుక దోపిడీపై సిఎం జగన్ నోరు విప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. జెపి వెంచర్స్ సంస్థలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఒప్పంద కాల పరిమితి ముగిసినప్పటికీ ఇసుక తవ్వకాలు ఎందుకు జరుగుతున్నాయో సమాధానం చెప్పాలన్నారు. ఇక్కడ నిల్వ ఉంచిన అక్రమ ఇసుకకు అనుమతి, స్టాక్ నిల్వలపై రికార్డులు చూపించాలన్నారు. సామాన్యులకు ఇబ్బంది లేకుండా ఇసుక రేట్లు తగ్గించాలని, అక్రమ ఇసుక ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండపేట, రామచంద్రపురం నియోజక వర్గాల టిడిపి నాయకులు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో అక్రమ ఇసుక నిల్వలపై మాట్లాడుతున్న టిడిపినాయకులు

జాబ్‌మేళాలో 148 మంది ఎంపిక

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మారేడుబాక రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, వైసిపి యువత తోట పద్మీలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మేళాలో మొత్తం 12 కంపెనీలకు 348 మంది హాజరు కాగా అందులో 148 మంది ఉద్యోగాలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు.స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ద్వారా ట్రైనింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ లు అందజేసినారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ జిల్లా మేనేజర్ పి. లోకమాన్, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎఎంసి ఛైర్మన్ శ్రీనివాసరావు, సర్పంచ్ ఎం.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను ప్రారంభిస్తున్న పద్మీ

వాడపల్లిలో ముగిసిన పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లిశ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక పవిత్రోత్సవాలు మూడవరోజు సోమవారం అత్యంత వైభవముగా ముగిశాయి. సంకల్పము, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము. మహాశాంతి హోమం, ప్రాయశ్చిత్త హోమాలు, మహా పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, మహాదాశీర్వచనము, నీరా జన మంత్రపుష్పములు తదితర కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఇఒ సత్యనారాయణరాజు, ధర్మకర్త మండలి సభ్యులు పవిత్రోత్సవాల్లో. పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు దూర ప్రాంతాల నుండి వచ్చిన యాత్రికులు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేశారు.

పాల్గొన్న ఛైర్మన్, ఇఒ, ధర్మకర్త మండల సభ్యులు

రాహుల్ పాండేను కలిసిన ఎఎంసి ఛైర్మన్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

విజయవాడ లో వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండేని అమలాపురం మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ దంగేటి డోలామణి రుద్ర సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ భవన నిర్మాణానికి అనుమతి ఇప్పించవలసిందిగా ఆయనను కోరారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు.

మోడేకుర్రులో టిడిపి స్థూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి-కొత్తపేట

మండల పరిధిలోని మోడేకుర్రు గ్రామ మహాలక్ష్మి నగర్ లో కార్యకర్తలు నూతనంగా ఏర్పాటు చేసిన టిడిపి స్థూపాన్ని ఆవిష్కరించి జెండాను బండారు సత్యానందరావు ఎగరవేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మన జెండా ఇదేవిధంగా ఎగురుతుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు సెప్టెంబర్ రెండవ తేదీన చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లాలో పర్యటన ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కం శెట్టి చంటి, ఎంపిటిసి సభ్యుడు రెడ్డి శ్రీనివాస్, సరేళ్ల రాజబాబు కార్యకర్తలు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

'స్పందన'లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-అమలాపురం, మండపేట

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం నూతనంగా 'గోదావరి భవన్' పేరిట నిర్మించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన హాలును ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, డి ఆర్ఒ సిహెచ్.సత్తిబాబులు అర్జీదారుల నుంచి సుమారుగా 209 అర్జీలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా పరిష్కార మార్గాలు చూపుతూ జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాలను సమర్థ వంతంగా చేపట్టి కార్యక్రమ నిర్వహణ తీరు పట్ల అర్జీదారులలో విశ్వసనీయతను పెంపొందించాలన్నారు కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ.శివశంకర్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఎస్ఇలు కృష్ణారెడ్డి, చంటిబాబు, డిపిఒ కష్ణకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, వివిధ జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ముసుగులో గ్రావెల్ అక్రమాలు జరిగాయని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో తహశీల్దార్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లి లో రైతుల ముసుగులో అక్రమ మైనింగ్ చేపట్టారని రెండు నెలల నుంచి ఈ విషయంపై ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు నాయకుల ఒత్తిడికి తలొగ్గి అక్రమాలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. పుంతగట్లకు రెండు లారీలు వేసి మిగిలిన 98 లారీలు అక్రమంగా అమ్ముకుంటూ రూ.కోట్లు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. ఈ నెల 22న మైనింగ్, రెవెన్యూ అధికారుల సమక్షంలో గ్రావెల్ తవ్వకాలపై అక్రమ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలన చేస్తామని చెప్పి అధికారులు కప్పదాటు వ్యవహారంతో ఒకరిపై ఒకరు నెపాన్ని నెట్టి పరిశీలన వాయిదా వేశారన్నారు. తిరిగి ఎప్పుడు పరిశీలన చేస్తారో చెప్పమంటే మైనింగ్ అధికారులు ఫోను ఎత్తడం లేదన్నారు. తహశీల్దార్ కార్యాలయానికి అనేక మార్లు ఫిర్యాదు చేసినా దానిని రిజిస్టర్ చేయకుండా మైనింగ్ అధికారులకు ఫార్వర్డ్ చేస్తూ చేతులుదులుపుకుంటున్నారన్నారు. ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాలో కనీస వేతనం రూ.12 వేలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోని స్పందన కార్యక్రమంలో మండపేట అసిస్టెంట్ లేబర్ అధికారినిమినిమం లేబర్ వైజ్ ఎంతని అడిగి తెలుసుకున్నారు. కొన్ని కంపెనీలు రూ.8,రూ.9,రూ.10 వేల చొప్పున ఇస్తాయని చెప్పడం ఎంతవరకు సమంజసమని అన్నారు.



తెలుగు తల్లి,గిడుగు వెంకట రామమూర్తి చిత్రాలు

గిడుగుకు ఘన నివాళి

ప్రజాశక్తి -అమలాపురంరూరల్

నేడు తెలుగు భాషా దినోత్సవం, తెలుగు రచయిత, భాషావేత్త, సామాజిక దార్శనికులు, వ్యవహారిక భాషను సమర్థిస్తూ పోరాటం చేసిన గిడుగు వెంకట రామమూర్తి జయంతి. తెలుగు భాష రక్షణకు వారు చేసిన సేవలను స్మరించుకుంటూ ఇదే నా చిత్ర నివాళి అంటూ సోమవారం పాలగుమ్మి జెడ్పి ఉన్నత పాఠశాల్లో చిత్రలేఖన ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ తెలుగు తల్లి,గిడుగు వెంకట రామమూర్తి చిత్రాలను వాటర్ కలర్స్ ఉపయోగించి పెయింటింగ్ వేశారు.



మేజర్ ధ్యాన్ చంద్ చిత్రం

హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌కు..

జాతీయ క్రీడా దినోత్సవం ను భారత హాకీ క్రీడాకారుడైన మేజర్ ధ్యాన్ చంద్ సూచికంగా ఆయన పుట్టినరోజును నేడు జరుపుకుంటారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మేజర్ ధ్యాన్ చంద్ కు ఇదే నా చిత్ర నివాళి అంటూ నర సింహ చంద్రకుమార్ మేజర్ ధ్యాన్ చంద్ చిత్రాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి వేశారు.

వర్షపు నీరు ఇలా.. నివాసం ఉండేదెలా..

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం కుమ్మరిపేటలో ఇటీవల కురిసిన వర్షాలకు వర్షపునీరు రోడ్డు మీద మోకాలు లోతు నిలవడంతో బురద నీటిలోనే రాకపోకలు సాగిస్తూ నివాసం ఉంటూ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వారు ఎటువంటి చర్యలు చేపట్టలేదని పలువురు చెబుతున్నారు ప్రతి సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే చాలు కొద్దిపాటి వర్షానికి కుమ్మరిపేటలోని రోడ్లన్నీ జలమయవుతాయి. దీనికి తోడు మురికి నీరు చేరి ఎటూ వెళ్లకపోవడంతో ఇక్కడ నివాసం ఉంటున్నవారికి అవస్థలు తప్పడం లేదు. దీంతో ఇక్కడి వారు రోగాల బారిన పడుతున్నారు. కుమ్మరిపేట ఊరు చివర కావడంతో వీరి సమస్యలు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై వర్షపు నీరు నిలవ లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కుమ్మరిపేటలో నిలిచిన బురద నీరు

బోస్ రాజకీయ వారసునిగా సూర్య ప్రకాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం

తన రాజకీయ వారసునిగా తన కుమారుడు పిల్లి సూర్య ప్రకాష్ రాజకీయ అరంగేట్రం చేస్తున్నారని తన కుమారుడిని ఆశీర్వదించాలని వైసిపి నాయకులు, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ కార్యకర్తలను కోరారు. ఆయన సోమవారం రాత్రి నియోజకవర్గం వైసిపి ముఖ్య కార్యకర్తలతో ముఖాముఖి ఏర్పాటుచేసి పలు అంశాలను చర్చించారు .తనయుని రాజకీయ అరంగేట్రాన్ని ప్రమాణం చేయించి అధికారకంగా బోస్ ప్రకటించడం విశేషం. నీతి నిజాయితీల మీదనే, రాజకీయాలు చేసుకుంటూ రావాలి అని కార్యకర్త సమక్షంలో తనయునికి సూచన చేశారు. తన రాజకీయ జీవితంలో రామచంద్రపురం నియోజకవర్గం ప్రజల పాత్ర చాలా ముఖ్యంగా నిలిచింది అన్నారు. తనయుని రాజకీయ ప్రవేశంతో నియోజకవర్గ ప్రజలకు ఇంకా మంచి చేసే భాగ్యం కల్పించడంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలకు బోస్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ముఖ్య నాయకులు తరలివచ్చారు. బోస్ నాయకత్వం పైన కుమారుడు పిల్లి సూర్య ప్రకాష్ నాయకత్వం బలపరుస్తూ వారు నినాదాలు చేశారు.

వైసిపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి సుభాష్‌చంద్రబోస్

నేరాలు ఘోరాలు

కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-తాళ్లపూడి

సారాను విక్రయించేందుకు ప్యాకింగ్ చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను తాళ్లపూడి ఎస్ఐ కెవి రమణ సోమవారం వెల్లడించారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో మండలంలోని రాగోలపల్లిలో నాటుసారాను విక్రయించేందుకు ప్యాకెట్లు చేస్తున్న పోసకుమాటి రామారావును అరెస్టు చేసి, ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటు సారాను తయారు చేసేందుకు వినియోగించే 120 కేజీల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితునికోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం కామనగరువు పంచాయతీ 4వ వార్డు కు చెందిన ఎమ్మెస్ఎన్ కాలనీలో రూ.10 లక్షల పంచాయతీ నిధుల నుంచి సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచ్, సర్పంచుల సమైక్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, ఎంపిటిసి సభ్యుడు మెండు గంగా భవానీ, కార్యదర్శి రాజేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఆదినారాయణ, సంసాని బాబీ, సంసాని అబ్బు, పమ్మి తాతాజీ, అయ్యప్ప, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు చేసి 25 వారాలు పూర్తి

ప్రజాశక్తి-అమలాపురం

చిందాడగరువు ఎంపిటిసి సభ్యులు మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేసి 25 వారాలు పూర్తయింది. స్పందనకు వచ్చే వారికి మజ్జిగ అందజేసి ఆయన వారి దాహాన్ని తీరుస్తున్నారు. కలెక్టరేట్ చలివేంద్రం ఏర్పాటు చేసి 25 వారాలు పూర్తయిన సందర్భంగా ఎంపిటిసి సభ్యులు మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు దంపతులు సహాయ సహకారాలు అందించిన కలెక్టర్ హిమాన్షు శుక్లాకు కతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జెసి ఎస్ నుపూర్ అజయ్, డిఆర్ఒ సిహెచ్.సత్తి బాబులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి విశ్వేశ్వరరావు , కలెక్టరేట్ సిబ్బందికి అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు

మహాసభ విజయవంతానికి ఎంఆర్‌పిఎస్ పిలుపు

ప్రజాశక్తి -ఐ.పోలవరం

ఎస్సి వర్గీకరణ కోసం త్వరలో హలో మాదిక చలో హైదరాబాద్ మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలని సోమవారం మురమళ్ళ గ్రామంలో ఎంఆర్‌పిఎస్ సమావేశం నిర్వహించారు. యు.విజయ కిషోర్ బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జ్ వల్లూరి సత్తిబాబు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మాదిగ పల్లె నుంచి ఇంటి కొకరు చొప్పున తరలి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మాదిగ జిల్లా ఎంఆఎఫ్ అధ్యక్షులు యు.వెంకట్రావు, ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు యాల్గడ్డ సత్తిబాబు, సవరపు భైరవమూర్తి, పలివెల నాగేంద్ర, అకుమర్తి మోహన్, వీధి నాగభూషణం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాడులపై న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇటీవల విజయవాడలో న్యాయవాది అవుల ప్రవీణ్‌కుమార్‌పై దాడి, వీరవల్లి పోలీస్ స్టేషన్‌లో తగరం కిరణ్‌బాబుపై అక్రమ కేసులను నిరసిస్తూ న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యదర్శి బొంగులూరి మధుబాబు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడికి పాల్పడ్డవారిని వెంటనే అరెస్ట్ చేయాలని, పెట్టిన అక్రమ కేసులను తొలగించాలన్నారు. ప్రభుత్వాలు న్యాయవాద రక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చిట్టంశెట్టి పుల్లయ్య, మళ్ల గంగాధర్, స్పోర్ట్స్ కార్యదర్శి లింగంపల్లి శివకుమార్, న్యాయవాదులు కొల్ల వీర్రాజు, కిలపర్తి శ్రీనివాస్, రాజాల చిట్టిబాబు, పలివెల నాగేంద్ర, రమణం వెంకట్రావు, పిల్లి బలరామయ్య, మాదాల మంజూష ఉన్నారు.

నెహ్రూకు టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

జగ్గంపేట మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను సోమవారం మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ మాజీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్విఎస్ఎన్ వర్మ, తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యనమల కృష్ణుడు పరామర్శించారు. నెహ్రూ సోదరి నాగలక్ష్మి ఇటీవల మరణించారు. ఈ సందర్భంలో టిడిపి అధినాయకుడు చంద్రబాబు ఫోన్ ద్వారా నెహ్రూను పరామర్శించారు. జ్యోతుల సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్ఎన్ అప్పలరాజు, వాసిరెడ్డి ఏసుదాసు, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు రాజు, కొత్త కొండబాబు, తదితరులు ఉన్నారు.

స్పందనకు 14 అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్డిఒ కార్యాలయంలో ఆర్డిఒ జె.సీతారామారావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని సమస్యల పరిష్కారం కోరుతూ 14 అర్జీలు అందాయి. ఈ అర్జీలు సంబంధిత శాఖల అధికారులకు పంపించి వెంటనే పరిష్కరించి అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించినట్లు ఆర్డిఒ సీతారామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ బాలామణి, మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, ఎడిఎ దైవ కుమార్, సిడిపిఒ ఉష, డిప్యూటీ తహశీల్దార్ భాను కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కూలర్ అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

దాతలు రాజేష్, పూజిత దంపతులు వారి కుమారుడు దక్ష పేరుతో రూ.10 వేల విలువైన వాటర్ కూలర్‌ను సోమవారం కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రానికి బహూకరించారు. వాటర్ కూలర్‌ను మున్సిపల్ కౌన్సిలర్ బలుసు శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుల్తానా బీబీ, టీచర్ బివిఎస్.రత్న కుమారి, ఆయా సత్యవతి పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో టిడ్కో ఇళ్ల అప్పగింతకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-కాకినాడ

టిడ్కో గృహాలను సందర్శిస్తున్న ఎంఎల్ఎ ద్వారంపూడి

సెప్టెంబర్ మొదటి లేదా రెండో వారంలో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. సోమవారం ఆయన స్థానిక పండూరుపేటలోని టిడ్కో గృహాలను సందర్శించారు. గృహనిర్మాణ ప్రగతిని, అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. తెలుగుదేశం పాలనలో టిడ్కో ఇళ్లను ప్రతిపాదించినప్పటికీ పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించలేక పోయారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పేద ప్రజల సొంతింటికల నెరవేర్చే క్రమంలో టిడ్కో, జగనన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణాలను వేగవంతం చేశారన్నారు. కాకినాడలో తొలివిడత సుమారు 1410 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా టిడ్కో ఇళ్లను సెప్టెంబర్ మొదటి, లేదా రెండవ వారంలో లబ్ధిదారులకు ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలా అరకొర వసతులు, అసంపూర్తి పనులతో లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించేందుకు తాము వ్యతిరేకమని, సకల సదుపాయాలు, సౌకర్యాలతో లబ్ధిదారులకు ఇవ్వాలన్నదే సిఎం ప్రధాన ఆకాంక్ష అని అన్నారు. ఆయన వెంట ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైసిపి నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎంసిసి చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, జెసిఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్ పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే మహిళాభ్యున్నతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మహిళల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, వైసిపి పాలనలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక 13వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. టిడిపి మేనిఫెస్టోపై మహిళలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి తెలుగుదేశం ప్రభుత్వానికే సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఒమ్మి బాలాజీ, చిక్కాల సత్యవతి, గాది శివరామకృష్ణ, తుమ్మల సునీత, ఎలిపే శ్రీనివాస్, బాసి రమణారెడ్డి, రేసు అన్నవరం, యాదవ శ్రీను, జారుల్లా ఖాన్, సయ్యపురెడ్డి రమణ, షేక్ బాషా, ఎస్.కె జిలాని, భద్రరావు, కలగా సువర్ల, పలివెల బాబ్జి, నిద్రబంగి సత్తిబాబు, మురళీకృష్ణ, బేతా అప్పలరాజు, జొన్న లోవరాజు, జొన్న వెంకన్న, రామకృష్ణ, కొండపు మంగ, పద్మ, మూగు చిన్ని, ఎల్లయమ్మ తెలుగు మహిళలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్



ఆర్థిక సహాయం అందిస్తున్న దొరబాబు

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వెనక ముప్పిడి జ్యోతి, సూర్య ప్రసాద్ ఇల్లు సోమవారం తెల్లవారు జామున దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో కుటుంబానికి చెందిన సామాగ్రి, దుస్తులు మొత్తం కాలిపోగా కుటుంబం నిరాశ్రయులయ్యారు. బాధిత కుటుంబాన్ని సోమవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ దవులూరి దొరబాబు, కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. హౌసింగ్ చైర్మన్ దొరబాబు బాధిత కుటుంబానికి రూ.10 వేల నగదు, బియ్యం, ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, తహసీల్దార్ ఎస్ఎల్ఎస్.కుమారి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, కౌన్సిలర్లు పాగా సురేష్ కుమార్, రెడ్డి లోవకుమార్, పితాని కృష్ణ, కో ఆప్షన్ సభ్యులు సల్లూరి కళ్యాణ్, రెడ్డి శ్రీనివాస్, లక్ష్మీ సత్యనారాయణ, పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఒకే సంస్థకు ఇసుక ధారాదత్తం

ప్రజాశక్తి - తాళ్లరేవు

పేద ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఇసుక రాష్ట్రవ్యాప్తంగా ఒకే సంస్థకు ధారా దత్తం చేసి సామాన్యులకు వైసిపి ప్రభుత్వం అన్యాయం చేస్తోందని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. తాళ్లరేవులో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో చిక్కాల రామచంద్రరావు మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సామాన్యులకు ఇసుక దొరకని పరిస్థితుల్లో ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న సహజంగా దొరికే ఇసుక ర్యాంపులు అన్నీ జెపి సంస్థకు ధారాదత్తం చేసేసారని ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక సుమారు రూ.వెయ్యి ఇవ్వగా ప్రస్తుతం రూ.4 నుంచి రూ.5 వేలకు అమ్ముతున్నట్లు చెప్పారు. వ్యవసాయానికి సైతం వైసిపి ప్రభుత్వం సాగునీరు సక్రమంగా అందించలేకపోతోందన్నారు. ఈ ప్రాన్నెన్ని చంద్రబాబు మాత్రమే మళ్లీ గాడిలో పెట్టగలరని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఫుంగరాల వెంకటేశ్వరరావు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

సిఎం జగన్ సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వచ్చే నెలలో సామర్లకోట సిబిఎం కళాశాల మైదానంలో జరిగే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సభలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు కోరారు. గుడివాడ, సిరివాడ, కాండ్రకోట గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 12 లేదా 15న ముఖ్యమంత్రి సామర్లకోట వస్తారన్నారు. ఈ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. జెకెసి లే అవుట్‌లో నిర్మించిన జగనన్న కాలనీని ఆయన ప్రారంభిస్తారన్నారు. 36 అడుగుల వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెండే సత్యవతి, వైస్ ఎంపిపి మిరియాల రాజా, ఎంపిడిఒ బత్తిన అశోక్ కుమార్, జోకా నానాజీ, పక్క గంగారావు, కామన రామకృష్ణ, మద్దూరి వెంకటేశ్వరరావు, మాకిరెడ్డి శ్రీనివాస్, గవరసాన రామస్వామి, చవ్వాకుల కృష్ణ, కసపర్తి బాబి, శ్రీను, గోపి, పంచాయతీల కార్యదర్శులు భారతి, బషీర్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సావరం పుంతరోడ్డు

మండపేట మండలంలోని ఏడిద గ్రామ శివారుసావరం నుంచి మండపేట పట్టణానికి చేరుకునేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉండే సావరం పుంత రోడ్డు గత కొంతకాలంగా అధ్వాన్నస్థితికి చేరుకోవడంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సావరం ప్రజలు మండపేటకు ఏడిద గ్రామం మీదుగా వెలుతున్నారు. అయితే ఈ పుంత రోడ్డు నేరుగా మండపేట బైపాస్ రోడ్డు మీదుగా రాష్ట్ర రోడ్డుకు కలుస్తుంది. అక్కడి నుంచి రాజారత్న, కలువపువ్వు సెంటర్, తదితర ప్రాంతాలకు వెళ్తువచ్చు. సుమారు నాలుగు కిలోమీటర్ల ఉన్న ఈ రోడ్డంతా గోతుల మయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ రోడ్డు అభివృద్ధి చేయడంలో భాగంగా రోడ్డును కొంతమేర తవ్వారు. అయితే ఎన్నికల అనంతరం తిరిగి పనులు ప్రారంభం కాలేదు. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గోతులమయంగా ఉన్న రహదారి

కార్యవర్గ సభ్యులతో పూటుకూరి

వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పూటుకూరి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా బండారులంక గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపిపి పూటుకూరి సుబ్రహ్మణ్య స్వామిని జాతీయ చేనేత ఫెడరేషన్ పెద్దలు ఎంపిక చేసినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం గాజువాకలోని టివిసెంటర్ కళ్యాణ మండపంలో జరిగిన ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ చేనేత ఆత్మీయ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు నియామకపత్రాన్ని అందించి పూటుకూరిని ఘన సత్కారం చేయించారు. ఈ కార్యక్రమంలో బండారు ఆనంద ప్రసాద్, నక్కిన చిన వెంకట్రాయుడు, గంజి చిరంజీవి, నిమ్మల కృష్ణ పాల్గొన్నారు.



నిలదీస్తున్న కౌన్సిలర్లు

సమస్యలపై మున్సిపల్ కౌన్సిలర్ల ధ్వజం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మున్సిపాలిటీలో తమ వార్డు సమస్యల విషయంలో అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు కౌన్సిలర్లు సోమవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్‌లో ధ్వజమెత్తారు. ఈ విషయమై త్వరలో సామర్లకోటకు రానున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి తాను ఫిర్యాదు చేయనున్నట్లు సీనియర్ కౌన్సిలర్ పితాని కృష్ణ స్పష్టం చేశారు. తమ వార్డులో ఎలాంటి అభివృద్ధి జరగని కారణంగా అభివృద్ధికి ప్రజాశీలకు సిద్ధం చేయకుంటే తన కౌన్సిలర్ పదవికి రాజీనామా చేస్తానని నాలుగో వార్డ్ కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ అధికారులను హెచ్చరించారు. చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పిట్టా సత్యనారాయణ, సేపేని సురేష్, కరణం రాజకుమార్, వీరభద్రరావు, కాళ్ల శ్యామల, పిల్లాడి సత్యవతి, నమ్మి సూర్య దుర్గ, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఊబా జాన్ మోజెస్, అధికారులు పాల్గొన్నారు.

జగన్‌కు పరిపాలన చేత కాదు

ప్రజాశక్తి-జగ్గంపేట రూరల్

ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా జగన్ నెరవేర్చక పోగా పరిపాలన చేయడం తనకు చేతకాదని నిరూపించుకున్నారని టిడిపి మహిళా కమిటీ చైర్మన్ ఎస్ఎవిఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం అన్నారు. సోమవారం మండలంలోని వెంగాయమ్మపురంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో నిర్వహిస్తున్న భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ పాలూరి బోసు బాబు, దాపర్తి సీతారామయ్య, కొత్త కొండబాబు, గంధం శ్రీను, రేఖ బుల్లి రాజు, సర్వసిద్ధి లక్ష్మణరావు, సుంకవల్లి రాజు, బద్ది సురేష్, కోట సత్యవతి, పోలినాటి ధర్మానందకుమారి పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ప్రతినిధులు

చంద్రయాన్ సక్సెస్ మరపురాని ఘట్టం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

చంద్రయాన్-3 విజయవంతం చరిత్రలో మరపురాని ఘట్టమని ఇస్రో శాస్త్రవేత్త పాలాని సోమరాజు అన్నారు. ఏలేశ్వరంలో సోమవారం నిర్వహించిన చంద్రయాన్ విజయోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయ వంతంతో భారత్ ప్రపంచ దేశాలకే తలమానికంగా మారిందన్నారు. ఎంఎల్ఎ పర్వత ప్రసాద్ మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతం యావత్ భారతజాతికి గర్వకారణమని కొనియాడారు. అనంతరం బాలాజీ సెంటర్ నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి జ్యోతుల నాగేశ్వర్ శ్రీనివాస్, ఏలేశ్వరం యూనిట్ అధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు, కర్రి అప్పారావు, గొల్ల నాగేశ్వరరావు, పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఉన్నారు.

యానాం వార్తలు

మల్లాడి తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

ప్రజాశక్తి-యానాం

యానాంలో నిర్మిస్తున్న పేకాట క్లబ్ స్థానిక ప్రజా ప్రతినిధి సహకారంతో జరుగుతోందని పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆరోపించడాన్ని సామాజిక కార్యకర్తలు పెసంగి వెంకటేష్, హరిప్రసాద్ తీవ్రంగా ఖండించారు. తప్పుడు ప్రచారాలు మల్లాడి మానుకోవాలన్నారు. మల్లాడి సొంత తమ్ముడైన మల్లాడి సత్తిబాబు, ఆయన ముఖ్య అనుచరులు క్లబ్‌లు పెట్టినప్పుడు మల్లాడి ఎక్కడున్నారని వారు ప్రశ్నించారు. ఎంఎల్ఎ గొల్లపల్లి గత నవంబర్‌లో పుదుచ్చేరి అసెంబ్లీ ముందు నిరాహారదీక్ష చేసి యానాంలో ఉన్న క్లబ్బుల్ని మూయించారని గుర్తు చేశారు. రాయల్ రిక్రియేషన్ క్లబ్బు నిర్వాహకులు కోర్టును ఆశ్రయించి క్లబ్బుకు కావాల్సిన అన్ని అనుమతులూ తెచ్చుకుని నడుపుతున్నారని తెలిపారు. నిర్వాహకులు మల్లాడికి కమీషన్ ఇవ్వడం ఆపేసి ఉండి ఉంటారని, అందుకే క్లబ్ మూసేయాలని మల్లాడి అంటున్నారని ఆరోపించారు. ఎంఎల్ఎపై బురద జల్లాలని ప్రయత్నించడం తగదన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ, తదితరులు

జగనన్న కాలనీలో పనులన పరిశీలన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లులో భాగంగా సామర్లకోట జగనన్న లేఔట్ లో సామూహిక గృహప్రవేశాల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాల్గొననుండగా అభివృద్ధి పనులను మౌలిక వసతి పనుల వేగవంతం చేశారు. ఈ సందర్భంగా కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ సోమవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబుతో కలిసి పనులను పరిశీలించారు. కాలనీలో మౌలిక వసతుల పనులను, ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, వైసిపి కాకినాడ సిటీ అధ్యక్షురాలు సుంకర లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు

ఇళ్ల స్థలాల జాబితాపై విచారణ ప్రారంభం

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

పట్టాలిచ్చి మూడేళ్లయిన తర్వాత ఇళ్ల స్థలాల లబ్ధిదారుల జాబితాపై నాగులపల్లిలో విచారణ ప్రారంభించారు. దీనిపై సోమవారం విచారణకు వచ్చిన 11 మంది రెవెన్యూ శాఖ అధికారుల వద్ద గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు కొత్త రెడ్డి, సుబ్బిరెడ్డి తదితరులు అధికారులతో మాట్లాడుతూ పట్టాల్చేడ్డి ముందు సుమారు ఆరుసార్లు విచారణ చేసి అర్హులను ఎంపిక చేశారన్నారు. మళ్లీ ఉన్న గ్రామంలో పేదలు ఇల్లు నిర్మించుకుంటే తమ గ్రామంలో మాత్రం ఇళ్లను నిర్మించనివ్వకుండా కక్ష కట్టి ఆపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో అర్హులే ఉన్నట్లు ఒక్క నాగులపల్లి గ్రామంలోనే అనర్హులు ఉన్నట్లు విచారణ చేయడం ప్రజలను అవమానించినట్లేనన్నారు. అర్హుల జాబితాను కుదించేందుకే పట్టాలిచ్చిన మూడేళ్ల తర్వాత ఈ ఎంక్వయిరీ పెట్టారన్నారు.

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S.No.788/2022

Between:
Nichenakolla Rajeswari ...Plaintiff
And
Kanikella Venkayamma, W/o.Bullayya, Hindu, Aged about 45 Yrs, R/o.D.No.12-41, SC Peta, Kadiyam (V) & (M), East Godavari District, JCJ Rajamahendravaram. ...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్య పూర్వకంగా త్రిప్పి పంపుచున్నారు. కావున ది.31-8-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీకోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)
రాజమండ్రి తేది.10.8.2023 దోశల శ్రీనివాసరావు అడ్వకేట్, రాజమండ్రి.

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S.No.303/2018

Between:
Athili Surya Kumar ...Plaintiff
And
Kesana Sita Rama Prasad, S/o.Gopala Kishna, Hindu, Aged Years, Employee, O/o. Deputy Director, Public Relation Officer, INRP Department, Anamkalakendram, Rajamahendravaram, East Godavari District. ...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్య పూర్వకంగా త్రిప్పి పంపుచున్నారు. కావున ది.30-8-2023 సం॥రం తేదీ ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీకోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)
రాజమండ్రి తేది.10.8.2023 దోశల శ్రీనివాసరావు అడ్వకేట్, రాజమండ్రి.

మహారాజశ్రీ ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 150/2022

విట్నేస్:
శ్రీమతి పెనుమాల లక్ష్మి నరసు and another ...వాదులు
అండ్
పెనుమాల నరసింహారావు అండ్ others ...ప్రతివాదులు

టు: పెనుమాల నరసింహారావు, తండ్రి: లక్ష్మణస్వామి, H.No. 302, ఇంద్ర ప్రస్థ అపార్ట్మెంట్, వాకలపూడి, కాకినాడ, కాకినాడ రూరల్ మండలం.

ఈ పై నెంబరు దావాను వాది మీపై దావా "A" షెడ్యూలు దాఖలా ఆస్తులకు Injunction ఉత్తర్వులు, "B" షెడ్యూలు దాఖలా ఆస్తులకు వాటా మున్నగు పరిహారములు కోరుచు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు సమన్లు నిమిత్తం పలుమార్లు పంపిననూ అందనందున మీ హాజరు నిమిత్తం వాయిదా ది.22-9-2023వ తేదీ అయి ఉన్నది. కావున మీరు వాయిదా రోజున ఉదయం గం॥10:30 నిలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. అట్లు కాని ఎడల మీ పరోక్షమందున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
అమలాపురం, 25-8-23. అడ్వకేట్స్, ముమ్మిడివరం. సెల్: 94400 41751

మహారాజశ్రీ ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 288/2019 and I.A.No. 33/2019 in O.S.No. 12/2019

విట్నేస్:
గాదిరాజు సత్యనారాయణ రాజు ...వాది
అండ్
1) మట్ల రాజు
2) తోట రాము ...ప్రతివాదులు

టు: ఆర్-1 /డి-1: మట్ల రాజు, తండ్రి: ఇస్సాకు, ప్లాట్ నెం. 134, వెంకట్రాది టౌన్‌షిప్, ఫేజ్-3, గట్కుసర్ మండలం, నారపల్లి పోస్టు రంగారెడ్డి జిల్లా, Native of కేశనకుర్రు గ్రామం, ఐ.పోలవరం మండలం.

ఈ పై నెంబరు దావాను వాది మీపై దావా ఆస్తికి హక్కుదారునిగా నిర్ణయించి భూమిని మనం చేయమని మున్నగు పరిహారములు కోరుచూ దావా దాఖలు చేసియున్నారు. సదరు పెండింగ్‌లో ఉండగా వాది చనిపోయినారు. వాది గారి వారసులుగా గాదిరాజు వసుదేవవర్మ గోవర్గాలు ఐ.ఏ.నెం. 288/2019 పిటీషను దాఖలు చేసే వార్ని దావాలో వాది గారి తరుపున అతని వారసులుగా జాయిన్ చేయమని కోరుచూ దాఖలు చేసియున్నారు. అలాగే దావాలో సాటుగా ఐ.ఏ.నెం. 83/2019 అను పిటీషును దావా తేదీవరకూ దావా "అస్తిని ఎవ్వరికీ ట్రాన్స్‌ఫర్ చేయకూడదని, ఇంజక్షన్ ఉత్తర్వులు ఇప్పించమని కోరుచూ దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు సమన్లు నిమిత్తం మరియు ఐ.ఏ.నెం. 288/2019, ఐ.ఏ.నెం. 33/2019లలో మీకు నోటీసులు అమలు నిమిత్తం మీ హాజరు నిమిత్తం వాయిదా ది.04-09-2023వ తేదీ అయి ఉన్నది. వాయిదా రోజు మీరు ఉదయం గం॥10:30 నిలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానింపబడును అని ఇందు మూలముగా తెలియచేయడమైనది.
(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
అమలాపురం, 25-8-23. అడ్వకేట్స్, ముమ్మిడివరం. సెల్: 94400 41751